నాడు అక్రమం.. నేడు సక్రమం

- పెందుర్తిలో ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా నిర్మాణం
- 15 రోజుల క్రితం నిర్మాణాన్ని తొలగించిన రెవెన్యూ అధికారులు
- నాడు అధికారులపై చిందులు తొక్కి, అడ్డుకున్న టీడీపీ నేత
- నేడు అదే స్థలంలో నిర్మించిన వాణిజ్య సముదాయం
- కూటమి నేత ఒత్తిడికి తలొగ్గిన రెవెన్యూ అధికారులు





మంగళవారం ప్రారంభమైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన వాణిజ్య సముదాయం (ఇన్‌సెట్) గత నెల 18న అప్పటి నిర్మాణాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న అధికారులు

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో పెందుర్తి ప్రాంతంలో అధికార కూటమి నాయకుల కనుసన్నల్లో కబ్జాలు కొనసాగుతున్నాయి. అడ్డుకుంటున్న రెవెన్యూ యంత్రాంగంపై బెదిరింపులకు దిగుతున్నారు. 'ప్రభుత్వ స్థలం అంటే అది మాదే'అన్న రీతిలో చెలరేగిపోతున్నారు. ఎంతలా అంటే... పెందుర్తి నడిబొడ్డున ఓ ప్రజాప్రతినిధి అండతో ప్రభుత్వ స్థలంలో జరిగిన నిర్మాణమే ఇందుకు తార్కాణం. అక్రమ నిర్మాణం అని తేల్చి గతంలో కూల్చేసిన అధికారులు, ఇప్పుడు అదే చోట పక్కా వాణిజ్య భవనం నిర్మించినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

దర్జాగా కబ్జా చేశారు

పెందుర్తి రాచ్చెరువు వద్ద ఆనందపురం–అనకాపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నెం.231లో ప్రభుత్వ స్థలం ఉంది. దీనిపై నగరానికి చెందిన ఓ టీడీపీ సానుభూతిపరుడి కళ్లు పడ్డాయి. స్థానిక కూటమి ప్రజాప్రతినిధి అండతో దాన్ని ఆక్రమించాడు. దర్జాగా అందులో వాణిజ్య సముదాయాన్ని నిర్మించాడు. దీనిపై ఎన్ని ఫిర్యాదులొచ్చినా సదరు ప్రజాప్రతినిధి దగ్గరుండి మరీ నిర్మాణం పూర్తి చేయించారు. తమ ప్రభుత్వంలో తమను ఆపేదెవరంటూ తమ అనుచర గణం వద్ద గొప్పలు పోతున్నారట.

అధికారులపై ఒత్తిడి

ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న వాణిజ్య సముదాయ నిర్మాణంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని కూల్చేందుకు గత నెల 18న వెళ్లారు. కొంత వరకు కూల్చిన తరువాత సదరు కూటమి 'ప్రజాప్రతినిధి' అక్కడకు వచ్చి మీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు దిగడంతో తిరుగుముఖం పట్టారు. ఆ ప్రజాప్రతినిధి కబ్జాదారులకు మరోసారి అండగా నిలిచాడు. దీంతో నిర్మాణం పూర్తి చేసి మంగళవారం దాన్ని అధికారికంగా ప్రారంభించేశాడు. ఇలా ప్రభుత్వ భూములను కబ్జాదారులు చెరబడుతున్నా.. కూటమి నాయకుల ఒత్తిడితో అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పెందుర్తి రాచ్చెరువు వద్ద నిర్మాణాన్ని ఇటీవలే కూల్చాం. అయితే అదే చోట, మళ్లీ అదే నిర్మాణం పూర్తి చేసినట్లు మా దృష్టికి రాలేదు. దీనిపై తక్షణమే విచారణ చేపడతాం. ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

క్లుప్తంగా

పోతురాజు విగ్రహానికి రేకుల షెడ్డు



ముత్యాలమ్మ గుడిలో పోతిరాజు విగ్రహంపై నూతనంగా వేసిన రేకుల షెడ్డు

పరవాడ: మండలంలోనివెంకటపతిపాలెం సమీపంలో కొలువుదీరిన ముత్యమాంబ ఆలయంలోని పోతురాజు విగ్రహానికి ఎట్టకేలకు నీడ సమకూరింది. విశాఖకు చెందిన దివంగత వలిశెట్టి గురయ్య తనయుడు తాతారావు, కుమారి దంపతులు సమకూర్చిన రూ.2.5 లక్షలతో నూతనంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు కూంద్రపు శ్రీరామ్మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేకుల షెడ్డు ఏర్పాటుకు ధన సాయం చేసిన తాతారావు దంపతులను గ్రామస్తులు, భక్తులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



దేవుడుబాబు

పెందుర్తి: స్థానిక మర్రిచెట్ల కాలనీలో నివాసం ఉంటున్న గొర్లి దేవుడుబాబు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ బాబూరావు తెలిపిన వివరాలు.. అండమాన్‌లోని నేవల్ డాక్‌యార్డులో పనిచేస్తున్న దేవుడుబాబు ఇటీవలే సెలవుపై ఇంటికి వచ్చాడు. భార్య నగరంలోని ఆమె సోదరి ఇంట్లో ఉంటోంది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లో ఫోన్ మర్చిపోయి బయటకు వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో తండ్రి తాతబాబు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

సబ్బవరం ఎంఈవో–2గా రవీంద్రబాబు



సబ్బవరం: స్థానిక ఎంఈవో–2గా ఎం.జె.రవీంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన బుచ్చెయ్యపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఉన్నారు. ఇక్కడ ఎంఈవో–2గా పనిచేసిన బోలెం సూర్యనారాయణ ఇటీవల పదవీవిరమణ చేశారు. ఆయన స్థానంలో బదిలీపై పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) చేపట్టారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

సబ్బవరం: ఈ నెల 8న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసినట్లు ఇరిగేషన్ శాఖ జేఈ సాయికిరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా వాయిదా పడిన ఎన్నికలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ప్రభుత్వ నిర్ణయం మేరకు వెల్లడిస్తామన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సర్వీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భారతీయ విద్యావిధానంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. యువజన సర్వీస్ ప్రతినిధి ఎస్.బాబు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతుల్లో కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ లెక్కల గణేష్ పాల్గొన్నారు.

రేపు మరిడిమాంబ పండగ



అమ్మవారి ఉత్సవ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: వెన్నలపాలెంలో కొలువైన మరిడిమాంబ అమ్మవారి పండగను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ నెల 5న జరిపేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామంలో మంగళవారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. వీధులను విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. గురువారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు రాత్రి అనుపు మహోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెన్నల అప్పారావు, వెన్నల వెంకినాయుడు, పైల సన్యాసిరావు, వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, వెన్నల నరసింగరావు, అఖినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో దివాకర్



ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో–2 రవీంద్రబాబు

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు అందిస్తున్న అలవెన్స్‌లు, ఫిజియోథెరపీ, విద్యా కార్యక్రమాలు అమలవుతున్న తీరును వివరించారు. భవిత కేంద్రం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగపరచుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు. వేడుకలను పురస్కరించుకుని దివ్యాంగులకు ఏర్పాటు చేసిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎంఈవోల చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అప్పలనాయుడు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉన్నత పాఠశాల ప్రత్యేక ఎడ్యుకేటర్ ఎస్.ఎస్.ఎస్.కుమారి, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసరావు, ఫిజియోథెరపిస్ట్ కిరణ్‌కుమార్, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవోలు ఎస్.లక్ష్మణరావు, జె.రవీంద్రబాబు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎల్.పద్మ, ఎస్.బేబీరాణి, బి.సింహాద్రి, సబ్బవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరి, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9 నుంచి 14 వరకు జన్‌జీల్–24



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9 నుంచి 14 వరకు జెన్‌జీల్–24 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. జెన్‌జీల్ కార్యక్రమంలో భాగంగా ఇంటర్ విద్యార్థులకు సోలో సింగింగ్, గ్రూప్ డ్యాన్స్, క్విజ్, వాలీబాల్, వక్తృత్వం, చెస్, క్యారమ్స్, స్కిట్‌లు, బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటాలని కోరారు. విజేతలకు 14న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా, జెన్‌జీల్ కన్వీనర్ పి.నవ్య, ఏడీకే రాజు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాంబ పండగ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వేపగుంట బీసీ కాలనీలో వెలసిన భూలోకమాంబ వార్షిక పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు–కుంకుమలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. మహిళలు కోలాటమాడారు. కలశాలను ఊరేగించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



విరాళం చెక్కును ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్‌కు అందిస్తున్న దాత నరసింహకుమార్ కుటుంబం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన ఎం.నరసింహకుమార్ లక్షా 11 వేల 116 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ వి.సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.